సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 25 । నవంబర్ । 2024



వర్గీకరణను తిప్పికొట్టాలి

ఎస్సీలంతా కలిసి ఉండాలని, విడిపోతే నష్టపోతారని రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ముని మనుమడు రాజారత్నం అంబేడ్కర్ హెచ్చరించారు. 8లో ▸



ఆస్తి కోసమే జంట హత్యలు

ఆస్తి కోసం జంట హత్యలు జరిగిన నేపథ్యంలో 48 గంటల్లోనే కైకలూరు పోలీసులు కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. 8లో ▸




ఆర్టీసీ బస్సు బోల్తా

తాడేపల్లిగూడెం-భీమవరం రోడ్డులో ముదునూరు వద్ద ఆర్టీసీ బస్సు బోల్తా కొట్టింది. ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. 8లో ▸

ఎమ్మెల్సీ బరి.. హోరాహోరీ

- విస్తృతంగా టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారం
- పోటీలో ఐదుగురు అభ్యర్థులు
- గోపిమూర్తి, నారాయణరావు మధ్యే ప్రధాన పోరు
- ఉపాధ్యాయ సంఘాల మద్దతు కూడగడుతున్న వైనం
- ఉమ్మడి పశ్చిమగోదావరిలో 6,267 ఓట్లు
- 40 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- వచ్చేనెల 5న ఎన్నిక





బి.గోపిమూర్తి (పీడీఎఫ్ అభ్యర్థి)



గంధం నారాయణరావు (ద్రాక్షారామం)

ఏలూరు జిల్లా	
పోలింగ్ కేంద్రాలు	20
ఓటర్లు	2,605
పశ్చిమగోదావరి జిల్లా	
పోలింగ్ కేంద్రాలు	20
ఓటర్లు	3,662

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రాజకీయం వేడెక్కింది. నామినేషన్లు, పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన క్రమంలో అభ్యర్థులు హోరాహోరీ ప్రచారానికి తెరతీశారు. ఉపాధ్యాయ సంఘాల వారీగా మద్దతు కూడగట్టుకోవడంతో మొదలుపెట్టి వ్యక్తిగతంగా ఓటర్లను కలుస్తూ ప్రచార పర్వంలో దూసుకెళ్తున్నారు. హ్యాట్రిక్ విజయం కోసం యూటీఎఫ్ బలపరిచిన పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి బరిలో ఉండగా కీలక ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో గంధం నారాయణ పోటీల్లో కీలకంగా ఉన్నారు. ఇక మరో ముగ్గురు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పలు సంఘాల మద్దతుతో పోటీలో ఉన్నారు.

కొనసాగుతున్న హడావుడి

ఉభయగోదావరి జిల్లాలో టీచర్ ఎమ్మెల్సీ హడావుడి కొనసాగుతోంది. ఉభయగోదావరి జిల్లాలోని ఐదు జిల్లాల పరిధి (ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ)లో ఆయా జిల్లాల కలెక్టర్లు ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 11న నోటిఫికేషన్ జారీ అయిన క్రమంలో 18 వరకు నామినేషన్ల స్వీకరణ, 19న స్క్రూటినీ ప్రక్రియ, 21న ఉపసంహరణలు పూర్తయ్యాయి. ఉపసంహరణల అనంతరం పీడీఎఫ్ అభ్యర్థిగా బొర్రా గోపిమూర్తి (భీమవరం), ఎస్టీయూతో పాటు మిగిలిన సంఘాలు బలపరిచిన గంధం నారాయణరావు (ద్రాక్షరామం), అలాగే నాయన వెంకటలక్ష్మి (సామర్లకోట), పి.దీపక్ (తాడేపల్లిగూడెం), కలవం నాగేశ్వరరావు (రాజమండ్రి) బరిలో నిలిచారు.

సాబ్జీ మరణంతో ఎన్నికలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉన్న షేక్ సాబ్జీ 2023 డిసెంబర్ 15న రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వాస్తవానికి 2027 మార్చి 29 వరకు ఆయన పదవీ కాలం ఉండటంతో టీచర్ ఎమ్మెల్సీ అనివార్యమైంది. పీడీఎఫ్ అభ్యర్థిగా గోపిమూర్తికి యూటీఎఫ్, ఏపీటీఎఫ్-1938, జూనియర్, డిగ్రీ, కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్లు, ఆదివాసీ, బీటీఏ, గ్రంథాలయ సంస్థల ఉద్యోగులు మద్దతు ఇస్తున్నారు. ఇక నారాయణరావుకు ప్రధానమైన ఎస్టీయూతో పాటు హెచ్ఎంల అసోసియేషన్, ఏపీటీఎఫ్, బీటీయూ, ఎస్ఎల్టీఏ, ఏపీఏఎస్లతో పాటు మరికొందరు మద్దతు ఇస్తున్నారు. దీంతో పోటీ వీరిద్దరి మధ్య హోరాహోరీగా ఉండనుందని ఉపాధ్యాయ సంఘాల నేతలు అంచనా వేస్తున్నారు. వచ్చే నెల 3వ తేదీతో ప్రచారపర్వం ముగించనున్నారు. ఇక ఏలూరు జిల్లాలో 20 మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయగా 2,605 మంది ఓటర్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 20 మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయగా 3,662 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

5 జిల్లాల్లో 16,316 మంది ఓటర్లు

ఉభయగోదావరి జిల్లాలోని 5 జిల్లాల పరిధిలో 16,316 మంది టీచర్లు ఓటు హక్కు నమోదుకు ఎన్రోల్ చేసుకున్నారు. వీరిలో 9,642 మంది పురుషులు, 6,674 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మండలానికి ఒక పోలింగ్ కేంద్రాన్ని ప్రామాణికంగా తీసుకుని ఏజెన్సీ ఏరియాలతో కలిపి మొత్తంగా 116 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే అత్యధికంగా పశ్చిమగోదావరి జిల్లాలో 3,662 ఓట్లు ఉన్నాయి. వచ్చేనెల 5న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియను బ్యాలెట్ విధానంలో (ప్రాధాన్య క్రమం) నిర్వహించనున్నారు. కాకినాడ కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తుండగా మిగిలిన జిల్లాల డీఆర్వోలు సహాయ రిటర్నింగ్ అధికారులుగా ఎన్నికల విధుల్లో ఉన్నారు. వచ్చేనెల 9న కాకినాడలోని జేఎన్టీయూ క్యాంపస్లో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈనెల 11 నుంచే ఎన్నికల కోడ్ అమలులో రావడంతో అధికార యంత్రాంగం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంది.

ద్వారకాతిరుమల క్షేత్రానికి నూతన శోభ



విద్యుత్ కాంతులీనుతున్న శివాలయం ఆర్చిగేటు

సాక్షి స్పందన

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల క్షేత్రం కొత్త శోభను సంతరించుకుంది. ప్రజాప్రతినిధులు, సినీ హీరోల ఫ్లెక్సీలతో దర్శనమిచ్చే గరుడాళ్వార్ సెంటర్ ఆలయ సమాచారాన్ని అందించే కేంద్రంలా మారింది. ఈనెల 15న 'సాక్షి'లో ప్రచురించిన 'ఎన్నికల కోడ్ ఉల్లంఘనులు' శీర్షికన కథనానికి మండల పరిషత్, పంచాయతీ అధికారులు స్పందించారు. స్థానిక గరుడాళ్వార్ సెంటర్ను ఆధ్యాత్మిక సమాచార కేంద్రంగా తీర్చిదిద్దేందుకు దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ప్రాంతంలో శ్రీవారి క్షేత్ర ఉప, దత్తత ఆలయాల పూర్తి వివరాలు, పథకాల సమాచారంతో కూడిన బోర్డులను ఏర్పాటుచేశారు. రాత్రి వేళల్లో సైతం ఇవి కనిపించేలా (విద్యుత్ బోర్డులు) అమర్చారు. ఇవి ఆకట్టుకోవడంతో పాటు మంచి సమాచారాన్ని అందించేలా ఉన్నాయని భక్తులు అంటున్నారు. అలాగే శివాలయం ఆర్చిగేటును రంగులతో సుందరీకరించి, విద్యుత్ లైట్లను ఏర్పాటుచేశారు. ఆ ప్రాంతం కొత్త కాంతులతో ధగధగలాడుతోంది. ఉగాది మండపం వద్ద (కొండపైకి వెళ్లే) ఆర్చిగేటు ముస్తాబవుతోంది.



గరుడాళ్వార్ కూడలిలో ఆలయ బోర్డులు

న్యూస్రీల్

ఫీజుల చెల్లింపుపై ఒత్తిడి తగదు

కలెక్టర్ నాగరాణి



భీమవరం: ఫీజు రీయింబర్స్మెంట్ సమస్యల కారణంగా ఏ విద్యార్థికి హాల్టికెట్లు నిరాకరించడం, తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాకుండా నిరోధించడం చేయరాదని కళాశాలల యాజమాన్యాలను కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. జిల్లాలో డిగ్రీ, ఇంటర్మీడియెట్ కళాశాలల యజమాన్యాలు ఇటువంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించబోమన్నారు. ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం, పరీక్షలకు రానీయకపోవడం వంటివి జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తే కళాశాలలను బ్లాక్లిస్టులో పెడతామని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ఫీజును కళాశాలల అకౌంట్లలోకి జమ చేస్తామని జీఓ ఇచ్చిందని, కళాశాలకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వం చెల్లిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులను ఎలాంటి ఇబ్బందులు పెట్టవద్దని సూచించారు.

కరస్పాండెంట్పై కేసు

ఆకివీడు: విద్యార్థినిని కొట్టిన ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై హనుమంతు నాగరాజు ఆదివారం చెప్పారు. స్థానిక విజ్ఞాన్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరస్పాండెంట్ ఎన్వీవీ సత్యనారాయణపై కేసు నమోదు చేశామన్నారు.

మనసు లేని వారే దివ్యాంగులు



తణుకులో బాలలతను సత్కరిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సమాజ సేవ చేయని వారు, మనసు లేనివారే దివ్యాంగులని ఐఏఎస్ అకాడమీ అధినేత మల్లవరపు బాలలత అన్నారు. తణుకు కమ్మ కల్యాణ మండపంలో ఆదివారం డాక్టర్ పీఎస్ఎస్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దివ్యాంగులపై సమాజం చూపుతున్న వివక్షను చూసి తట్టుకోలేకపోయానని, అందరికీ తాను స్ఫూర్తి కావాలనే ఉద్దేశంతో సివిల్స్ సాధించానన్నారు. ఏడాదికి ఒక్క దివ్యాంగుడినైనా ఐఏఎస్ చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నానని స్పష్టం చేశారు. దివ్యాంగులమని ఎవరూ బాధపడవద్దని, మన విజయాన్ని చూసి అందరూ స్ఫూర్తి పొందేలా ముందుకు సాగాలన్నారు. ఆత్మీయ సమ్మేళనం నిర్వహించిన ఫౌండేషన్ అధ్యక్షుడు సతీష్కుమార్ను అభినందించారు. భీమవరం, తణుకు, రాజమండ్రి ఆస్పత్రుల నుంచి ప్రముఖ వైద్యులు హాజరై దివ్యాంగులకు ఉచిత వైద్య సేవలందించారు. కైకరానికి చెందిన వెంకటేశ్వర మెడికల్స్ యాజమాన్యం ఉచితంగా మందులు అందించారు. దివ్యాంగులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించే స్టాల్స్ను ఏర్పాటుచేశారు. పలు కంపెనీల ప్రతినిధులతో జాబ్మేళా నిర్వహించి దివ్యాంగులకు ఉద్యోగావకాశాలు కల్పించారు.

జిల్లా నలుమూలల నుంచి..

ఆత్మీయ సమ్మేళనానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా నలుమూలల నుంచి దివ్యాంగులు భారీగా తరలివచ్చారు. వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సుమారు 5 వేల మందికి పైగా దివ్యాంగులు పాల్గొన్నారు.

చిన్న వెంకన్న సేవలో డీజీపీ



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న రాష్ట్ర డీజీపీ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన్న వెంకన్న ఆలయాన్ని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదివారం సందర్శించారు. కుటుంబసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. డీజీపీ స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలకగా, ఈఓ మూర్తి మెమెంటో, ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా హనుమద్ కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం సువర్చలా హనుమద్ కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సోమవారం ఆలయంలో లక్ష తమలపాకులతో పూజలు నిర్వహించనున్నారు.

ప్రజావాణిని గట్టిగా వినిపించాం

ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

తణుకు అర్బన్: రాష్ట్ర శాసనమండలి సమావేశాల్లో ప్రజల వాణిని ప్రస్తావించడంలో సఫలీకృతమయ్యామని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. తణుకు వైఎస్సార్సీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభలో ప్రతి అంశంపైనా ప్రభుత్వంపై గట్టి ఒత్తిడి తీసుకువచ్చి సమస్యల పరిష్కారానికి పట్టుబట్టామన్నారు. కూటమి మంత్రులు 80 శాతం సమయాన్ని గత ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకే వినియోగించడం శోచనీయమన్నారు. ముఖ్యంగా పంటల బీమా మొత్తాన్ని గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం చెల్లించేదని.. అయితే కూటమి ప్రభుత్వం రైతులనే కట్టుకోవాలని చెబుతుండటంపై, కరెంటు చార్జీల సర్దుబాటులో భాగంగా వినియోగదారులపై ట్రూఅప్ పేరుతో భారాన్ని మోపే కార్యాచరణపై, సోషల్ మీడియా వేధింపుల పేరుతో అమాయకులపై కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ సభ నుంచి వాకౌట్ చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు గ్రామాలకో డంపింగ్ యార్డు ఏర్పాటుచేయాలని, వసతి గృహాల్లో మెస్ చార్జీలను పెంచాలని, బకాయిలు కూడా చెల్లించాలని డిమాండ్ చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణాల్లో ఉన్న భవనాల పనులను ఇప్పుడు నిలుపుదల చేశారని, వాటిని కూడా కొనసాగించాలని, సంచార జాతులకు ఆధార్ కార్డులు కేటాయించి వారికి ప్రభుత్వ సంక్షేమం అందేలా చూడాలని కోరామన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాపు సామాజికవర్గానికి రూ.10 వేల కోట్లపైగా లబ్ధి చేకూరిందని, ప్రస్తుత ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించాలని కోరామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్సీలకు ప్రొటోకాల్స్ పాటిస్తూ 15 నియోజకవర్గాల్లోనూ ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేలా కార్యాచరణ చేయాలని సూచించామన్నారు. ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీలో భాగంగా బడ్జెట్లో నిధులు కేటాయించలేదనే విషయాన్ని సభ దృష్టికి తీసుకువెళ్లామని ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ తెలిపారు. ఎంపీపీ రుద్రా ధనరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, నియోజకవర్గ వైఎస్సార్సీపీ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, నాయకులు వి.సీతారాం, ముళ్లపూడి బాబూరావు, జల్లూరి జగదీష్, షేక్ జిలాని, వై.రామకృష్ణ పాల్గొన్నారు.

పెంచిన చార్జీలను ఉపసంహరించాలి



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని, స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని వామపక్ష పార్టీల జిల్లా సదస్సులో నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలో సీపీఎం, సీపీఐ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ తదితర వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత ప్రజలపై మోపేందుకు సిద్ధమయ్యారని దుయ్యబట్టారు. అలాగే స్మార్ట్మీటర్లను బలవంతంగా బిగిస్తున్నారని, దీనిని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. సీపీఎం నగర కార్యదర్శి పి.కిషోర్, సీపీఐ నగర కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, సీపీఐ (ఎంఎల్) డెమోక్రసీ నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

● వనాలు.. జనాలు



పెనుమంట్ర : పంచగ్రామ రెడ్డి సేవా సంఘ సమారాధన వేదికపై నృత్యాలు చేస్తున్న చిన్నారులు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదివారం కార్తీక వనసమారాధనలు భారీగా జరిగాయి. కులసంఘాలు, పలు సంస్థల ఆధ్వర్యంలో కార్తీక దామోదరుడికి పూజలు చేసి సమారాధనలు నిర్వహించారు. పిల్లలు, పెద్దలంతా ఆటపాటలు, పోటీలతో సందడి చేశారు. సహపంక్తి భోజనాలు చేసి ఐక్యతను చాటారు. - సాక్షి నెట్వర్క్



పెంటపాడు : రెడ్డి సంఘు సమారాధనలో..



భీమడోలు: ఆర్యవైశ్య వనసమారాధనలో సందడి

ఉత్సాహంగా సాక్షి స్పెల్-బి పరీక్షలు

- నాలుగు విభాగాలుగా నిర్వహణ
- జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన విద్యార్థులు



తాడేపల్లిగూడెం సెంట్ ఆన్స్ స్కూల్లో స్పెల్-బి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం అర్బన్: 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో సాక్షి స్పెల్-బి పరీక్షలు ఉత్సాహంగా జరిగాయి. తాడేపల్లిగూడెంలోని సెంట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో ఆదివారం స్పెల్-బి పరీక్షలు నిర్వహించారు. presenting స్పాన్సర్గా Dukes waffy, అసోసియేట్ స్పాన్సర్గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ (రాజమండ్రి) వ్యవహరిస్తున్నారు. స్పెల్-బి పరీక్షలకు జిల్లాలోని జంగారెడ్డిగూడెం, పాలకొల్లు, గణపవరం, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. తమ పిల్లలు స్పెల్-బిలో పాల్గొనేలా తల్లిదండ్రులు దగ్గరుండి పరీక్షకు తీసుకువచ్చారు. పరీక్షలను నాలుగు విభాగాలుగా నిర్వహించారు. ఒక్కో విభాగంలో 40 ఇంగ్లిష్ పదాలను ఇన్విజిలేటర్గా వ్యవహరించిన సెంట్ ఆన్స్ ఉపాధ్యాయుడు మైకులో వెల్లడించగా, అనంతరం డిజిటల్ స్క్రీన్ ద్వారా కంప్యూటర్ వాయిస్ను ఉపయోగించి ఇంగ్లిష్ పదాలను తెలియజేశారు. విద్యార్థులు ముందుగా ఇన్విజిలేటర్ చెప్పిన పదానికి, తర్వాత కంప్యూటర్ వాయిస్లో విన్న పదాలకు మధ్య ఉన్న వాయిస్ సౌండ్ను అనుసరించి పదాలకు స్పెల్లింగ్లు రాశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

ప్రాక్టీస్ చేశాను



సాక్షి స్పెల్-బి పరీక్షకు హాజరయ్యేందుకు మా స్కూల్లో ఇంగ్లిష్ పదాలను చదివించి ప్రాక్టీస్ చేయించారు. పరీక్ష బాగా రాశాను. భవిష్యత్తులో ఇంగ్లిష్ను మరింత నైపుణ్యంగా నేర్చుకుంటాను.

– స్వర్ణమూడి జోత్స్న, 7వ తరగతి, ప్రతిభ స్కూల్, జంగారెడ్డిగూడెం

సంతోషంగా ఉంది



సాక్షి స్పెల్-బి పరీక్ష రాయడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో ఇంగ్లిష్ పదాలకు స్పెల్లింగ్ రాయడంతో పాటు పదాలను పలికే విధానంలో నైపుణ్యం పెంచుకోవాలని తెలిసింది. ఆ దిశగా ఇంగ్లిష్ ప్రాక్టీస్ చేస్తాను.

– దొమ్మేటి గౌతమ్, 4వ తరగతి, ఆదిత్య స్కూల్, వల్లూరు

శిక్షణ పొందాలి



సాక్షి స్పెల్-బిలో పాల్గొనేందుకు మంచి శిక్షణ పొందాల్సి ఉంది. ఒకసారి పరీక్షకు హాజరైతే ఎలా ఇంగ్లిష్పై నైపుణ్యం సాధించాలో తెలుస్తుంది. ఇప్పుడు స్పెల్-బి పరీక్షను బాగానే రాశాను. ఇంకా శిక్షణ పొందాలి.

– పెన్మత్స సాత్విక, 7వ తరగతి, ఆదిత్య స్కూల్, తాడేపల్లిగూడెం

నైపుణ్యం సాధించేలా..



సాక్షి స్పెల్-బి పరీక్షను రాయడం చాలా బాగుంది. మొదటిసారి రాయడంతో భవిష్యత్తులో ఇంగ్లిష్ పదాలకు స్పెల్లింగ్లపై నైపుణ్యం సాధించి పరీక్షకు హాజరుకావాలని తెలిసింది. ఇంగ్లిష్పై ఆసక్తి పెరిగింది.

– మాదేటి సూర్యనారాయణ, 6వ తరగతి, ఆదిత్య స్కూల్, తాడేపల్లిగూడెం

రేపు విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలు

ఏలూరు (టూటౌన్): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఈనెల 26న ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్కుమార్ ప్రకటనలో తెలిపారు. మూడు చక్రాల రిక్షా రేస్, జావెలిన్ త్రో, షాట్పుట్, పరుగు, క్రికెట్, క్యారమ్స్, సాఫ్ట్బాల్, డిస్కస్ త్రో తదితర పోటీలు నిర్వహిస్తామన్నారు.

క్లుప్తంగా

ముగిసిన కరాటే పోటీలు



గోల్డ్ మెడల్ సాధించిన ఆకివీడు కరాటే కింగ్ ఎస్కే.సలీంకు మెమెంటో అందజేస్తున్న దృశ్యం

ఆకివీడు : రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో గోల్డ్‌మెడల్‌ను ఆకివీడుకు చెందిన ఎస్కే.సలీమ్ కైవశం చేసుకున్నారు. ద్వితీయ స్థానంలో రాము, తృతీయ స్థానంలో శ్రీను నిలిచారు. స్థానిక షాదీఖానాలో ఉదయం ప్రారంభమైన పోటీలు రాత్రి వరకూ కొనసాగాయి. పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 500 మంది కరాటే విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. స్వీయ రక్షణ కోసం కరాటే అవసరమని ఎస్సై హనుమంతు నాగరాజు చెప్పారు. రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్ని తొలత ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో కరాటే ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి, గెలుపోటముల్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర కరాటే మాస్టర్లు మహ్మద్ జహంగీర్, ఆర్.వెంకటేశ్వరరావు, పలువురు రిఫరీలు పాల్గొనగా, జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్కే.ఎస్దానీ ఆధ్వర్యంలో పోటీలు రసవత్తరంగా జరిగాయి.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి : పెదవేగి మండలం రాట్నాల కుంటలో వెలిసిన శ్రీ రాట్నాలమ్మ తల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానానికి చేరుకుని అక్షరాభ్యాసాలు, నామకరణలు తదితర మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారి పూజా టిక్కెట్లపై రూ.16,210, లడ్డూ ప్రసాదంపై రూ.15,450, ఫొటోల అమ్మకంపై రూ.1,840, విరాళంపై రూ.9,235 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ చెప్పారు.

ఆర్చరీ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఆర్చరీ క్రీడాకారులు

భీమవరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరంలోని వోల్గా ఆర్చరీ అకాడమీలో ఆదివారం జిల్లా సీనియర్ విభాగంలో సెలక్షన్స్ నిర్వహించారు. కాంపౌండ్ ఉమెన్ విభాగంలో ఎం.సూర్యహంసిని, కె.శరణ్య, కె.సుష్మిత, కె.హేమశ్రీ, టి.తనన్య, వి.స్ఫూర్తి ఎంపికయ్యారని అసోసియేషన్ సెక్రటరీ ఎల్.జయరాజు తెలిపారు. కాంపౌండ్ మెన్‌లో ఎం.సుహాస్, సీహెచ్ హృషికేష్ నాయుడు, రికర్వ్ మెన్‌లో టి.యశ్వంత్, ఎస్.జగదీష్, ఇండియన్ రౌండ్‌లో ఎం.అభినవ్, ఎం.జాహ్నవి ఎంపికయ్యారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దెందులూరు: సోమవరప్పాడు వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నడిపల్లి శ్రీనివాసరావు(65) మృతి చెందారు. దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ తెలిపిన వివరాల ప్రకారం.. సీనియర్ అసిస్టెంట్ నడిపల్లి శ్రీనివాసరావు భీమడోలు తహసీల్దార్ కార్యాలయం నుంచి ఇటీవల దెందులూరు కార్యాలయానికి బదిలీపై వచ్చారు. ఆదివారం భీమడోలు కార్యాలయంలో చార్జీ అప్పచెప్పి ఏలూరుకు వెళ్తున్నారు. సోమవరప్పాడు వద్ద కుక్క అడ్డురావడంతో రోడ్డుపై పడిపోయారు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందారు.

● బీచ్‌లు కళకళ



జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులతో కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లు ఆదివారం కిటకిటలాడాయి. అధికారుల అంచనా ప్రకారం సుమారు 25 వేల మంది బీచ్‌ను సందర్శించి ఉంటారని అంచనా వేస్తున్నారు. డీఎస్పీ వేద ఆధ్వర్యంలో దుర్గా ప్రసాద్ పర్యవేక్షణలో నలుగురు ఎస్సైలు, 90 మంది సిబ్బంది బందోబస్త్ ఏర్పాట్లలో పాల్గొన్నారు. వీరితో పాటు 20 మంది గజ ఈతగాళ్లను మత్స్యశాఖ ఆధ్వర్యంలో నియమించారు. బీచ్‌కు వచ్చిన సందర్శకులు సముద్రపు అలల మధ్య సేదతీరి తీరంలోని ఆలయాలను సందర్శించారు.

– మొగల్తూరు

● జలపాతం అందాలు



బుట్టాయగూడెం మండలం ముంజులూరు అటవీ ప్రాంతంలోని ఏనుగుతోగు జలపాతం వద్ద ఆదివారం పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చి సందడి చేశారు. కొండలపై నుంచి జాలువారుతున్న జలపాతం చూపరులను ఇట్టే ఆకర్షిస్తుంది. కార్తీకమాసం చివరి ఆదివారం కావడంతో ఉభయ గోదావరి జిల్లాలతోపాటు తెలంగాణ, ఇతర ప్రాంతాల నుంచి కూడా అనేక మంది సందర్శకులు జలపాతాన్ని చూసి పరవశించిపోయారు. పలువురు కుటుంబ సభ్యులతో తరలివచ్చి జలపాతాన్ని తిలకించారు. అనేక మంది జలపాతం సమీపంలో సహపంక్తి భోజనాలు చేసి ఆటపాటలతో ఆనందంగా గడిపారు.

– బుట్టాయగూడెం

● గుబ్బల మంగమ్మకు పూజలు



కార్తీక మాసం చివరి ఆదివారం గుబ్బల మంగమ్మ తల్లి గుడికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భారీగా తరలి వచ్చి మంగమ్మతల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి తరలివచ్చారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మర్లగూడెం అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న పాటమ్మతల్లిని, పసుపులమ్మ తల్లిని కూడా భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

– బుట్టాయగూడెం

వర్గీకరణను తిప్పికొట్టాలి

అంబేడ్కర్ మునిమనువడు రాజారత్నం అంబేడ్కర్

నూజివీడు: ఎస్సీలంతా కలిసి ఉండాలని, విడిపోతే నష్టపోతారని రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ముని మనుమడు రాజారత్నం అంబేడ్కర్ హెచ్చరించారు. ఏలూరు జిల్లా నూజివీడులో మాల యోధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మాలల ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజారత్నం అంబేడ్కర్ మాట్లాడుతూ రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు నిండుతున్న నేపథ్యంలో మనుధర్మశాస్త్రం రోజుల్లోకి ఎస్సీలను తీసుకెళ్లడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎస్సీలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వర్గీకరణను తిప్పికొట్టాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని, ఎస్సీలందరూ కలిసి కట్టుగా ముందుకు సాగాలని చెప్పారు. రాష్ట్రంలో, దేశంలోని అధికార పార్టీలు అసెంబ్లీలో, రాజ్యసభలో, లోక్‌సభలో ఎక్కువ సీట్లు సాధించి ఉండొచ్చని, దేశంలో మెజారిటీ ప్రజలమైన తాము తలుచుకుంటే మీ ఆటలు సాగనివ్వబోమని, వర్గీకరణను తీసుకురావాలని చూస్తే మీ మంత్రులు, ఎమ్మెల్యేలు రోడ్లపై తిరగలేరని, తమ సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు, శాసనవ్యవస్థలు రెండూ కుమ్మక్కవ్వడంతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. రాజ్యాంగాన్ని అనుసరించి పాలించడాన్ని ప్రభుత్వాలు పక్కన పెట్టి తమ ఇష్టం వచ్చిన విధంగా పాలించడానికి ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో రాబోయే రోజుల్లో సామాన్యుల పరిస్థితి ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.



నూజివీడులో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్



సభకు హాజరైన మాల సోదరులు

దమ్ముంటే రాజ్యాంగ సవరణ చేయాలి : మాజీ ఎంపీ హర్షకుమార్

ప్రధాని నరేంద్ర మోదీకి దమ్ముంటే పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేసి ఎస్సీ వర్గీకరణ చేయాలని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ సవాల్ విసిరారు. నూజివీడులో నిర్వహించిన సభలో హర్షకుమార్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని 341 ఆర్టికల్ ప్రకారం ఎస్సీ కులాలకు సంబంధించి ఒక కులాన్ని చేర్చాలన్నా, తొలగించాలన్నా కేవలం పార్లమెంట్‌కు మాత్రమే అధికారం ఉందని చెప్పారు. అది కూడా మూడొంతుల మెజారిటీతో మాత్రమే వీలవుతుందన్నారు. అది చేయకుండా దొంగదారిలో వర్గీకరణ చేయాలని చూడడం దారుణమని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు కుట్రని, అది రాజకీయ తీర్పని వ్యాఖ్యానించారు. దీనికంతటికీ కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వం వహించారన్నారు. ఫిబ్రవరిలో దీనిపై సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వకుండా వాయిదా వేసిందని, ఆ తరువాత మోదీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాదిగల విశ్వరూప మహాసభకు వెళ్లి ఎస్సీ వర్గీకరణకు ఉన్న అడ్డంకులన్నీ తొలగిస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. చంద్రబాబు తన మ్యానిఫెస్టోలో వర్గీకరణ తానే చేస్తానంటూ పేర్కొన్నారని తెలిపారు. పార్లమెంట్‌కు తప్ప ఆర్టికల్‌లో జోక్యం చేసుకునే అధికారం లేని రాష్ట్రాలు వర్గీకరణ ఎలా చేస్తాయని హర్షకుమార్ ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎలక్షన్ కమిషన్‌ను, సుప్రీంకోర్టును, సీబీఐని, ఈడీని తన గుప్పెట్లో పెట్టుకొని తనకిష్టమొచ్చినట్టుగా ఆడిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వర్గీకరణ పేరుతో నాటకాలు ఆడుతున్నారని హర్షకుమార్ మండిపడ్డారు. కులగణన నిర్వహించకుండా వర్గీకరణ ఎలా చేస్తారో చెప్పాలన్నారు. వర్గీకరణ అంశాన్ని అడ్డం పెట్టుకొని నిరుద్యోగులను సైతం మోసం చేస్తున్నారని విమర్శించారు. మొదటి సంతకం చేసిన డీఎస్సీని నిర్వహించకుండా కాలయాపన చేస్తూ వాయిదాలపై వాయిదాలు వేస్తూ జాప్యం చేస్తున్నారన్నారు.

అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు

అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెప్పే ముఖ్యమంత్రి దేశంలో ఎవరైనా ఉన్నారంటే అది చంద్రబాబేనని హర్షకుమార్ దుయ్యబట్టారు. ఎన్నికల ముందు భీమవరానికి రింగురోడ్డు వేస్తానని చెప్పిన పవన్ కల్యాణ్ ఎక్కడని ప్రశ్నించారు. తాడేపల్లిగూడెం-భీమవరం రోడ్డుకు దిక్కులేకుండా ఉందని దుయ్యబట్టారు. ఇంకా పాత ప్రభుత్వంపై పడి ఏడవడమే తప్ప ఇప్పటివరకు ఒక్క పని కూడా చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాధికారం కావాలంటే 80 లక్షల మంది ఉన్న మన మందరం కలిసి రాజకీయ పార్టీని స్థాపించి ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో మాల మహాసభ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు, నాయకులు బేతాళ శరత్, పంతగాని రమేష్, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, నత్తా నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

నూజివీడులో గొలుసు దొంగల హల్‌చల్

నూజివీడు: నూజివీడు పట్టణంలో ఆదివారం గొలుసు దొంగలు హల్‌చల్ చేశారు. తెల్లవారుజామున ఆరు గంటలకు గుడికి వెళ్తున్న మహిళ మెడలో గొలుసు లాగేందుకు ప్రయత్నించారు. మహిళ ఎదురుతిరిగే సరికి పరారయ్యాడు. ఉదయం 10.30 గంటలకు చర్చికి వెళ్తున్న మహిళ మెడలో మూడు కాసుల బంగారు తాడును లాక్కొని బైక్‌పై పరారయ్యాడు. ఈ రెండూ గంటల వ్యవధిలో ఒకేరోజు చోటు చేసుకోవడంతో సంచలనంగా మారింది. పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీకి చెందిన కలపాల శేషుకుమారి రోజూ గుడికి వెళ్లడం అలవాటు. తెల్లవారుజామున 6 గంటల సమయంలో గుడికి వెళ్తుండగా ఎస్సీ బాలికల హాస్టల్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి మంకీ క్యాప్ పెట్టుకొన్న వ్యక్తి మెడలోని తాడును లాగాడు. ఆమె అప్రమత్తమై గట్టిగా పట్టుకోవడంతో గొలుసు దొంగకు చిక్కలేదు. అతను మళ్లీ లాక్కోవడానికి ప్రయత్నించగా మహిళ వద్ద ఉన్న పూల బుట్టతో కొట్టడానికి ప్రయత్నించడంతో ఆగంతకుడు పారిపోయాడు. వెంటనే స్థానికులకు తెలియజేయగా గాలించినా ఆచూకీ దొరకలేదు. ఉదయం 10.30 గంటల సమయంలో అమ్మవారితోటలో జగతాపు రమణ ప్రశాంత లక్ష్మి చర్చికి వెళ్తుండగా ఆగంతకుడు వెనుక నుంచి వచ్చి మెడలో ఉన్న మూడు కాసుల నాన్తాడు లాక్కొని వేగంగా బండిపై వెళ్లిపోయాడు. పోలీసులు నిఘా పెంచి గొలుసు దొంగల ఆట కట్టించాలని కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు బోల్తా

ఇద్దరికి గాయాలు.. 25 మంది ప్రయాణికులు సురక్షితం



ముదునూరు వద్ద రోడ్డు పక్కన బోల్తా పడ్డ బస్సు

పెంటపాడు: గూడెం- భీమవరం రోడ్డులో ముదునూరు వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సు బోల్తా కొట్టింది. ఇద్దరికి స్వల్పగాయాలు కాగా బస్సులో ప్రయాణిస్తున్న 25 మందికి సురక్షితంగా బయటపడ్డారు. రోడ్డు మలుపు తిప్పే క్రమంలో ప్రమాదం చోటు చేసుకొంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గూడెం డిపో నుంచి భీమవరం వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు 26 మందితో బయలుదేరింది. ముదునూరు వద్దకు వచ్చేసరికి రోడ్డు మలుపు ఉండటంతో డ్రైవర్ దుర్గాసాయి స్టీరింగ్ తిప్పడంతో స్టీరింగ్ ఫెయిలైంది. బస్సు వేగాన్ని తగ్గించి ప్రయాణికులకు గాయపడకుండా డ్రైవర్ ప్రయత్నించినట్లు ప్రయాణికులు తెలిపారు. పెంటపాడు ఎస్సై స్వామి సంఘటనా స్థలానికి చేరుకొని సిబ్బంది, స్థానికుల సాయంతో గాయపడిన మహిళా కండక్టర్‌ను, మరో ప్రయాణికుడిని 108 అంబులెన్స్‌లో గూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మిగతా ప్రయాణికులను మరో బస్సులో భీమవరం తరలించారు.

ఫిబ్రవరిలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు తదితరులు

ఏలూరు (టూటౌన్): అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలు శ్రీకాకుళం జిల్లాలో ఫిబ్రవరి 6, 7, 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్నామని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు తెలిపారు. స్థానిక ఆర్ఆర్ పేటలోని స్ఫూర్తి భవన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో పరుచూరి రాజేంద్ర బాబు మాట్లాడుతూ పాలకవర్గ విధానాల వల్ల దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిందని యువతకు ఉపాధి కల్పనలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. విద్య, వైద్యం, ఉపాధి భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కులుగా గుర్తించినా విద్య వ్యాపారంగా మారిందని, వైద్యం అందరికీ అందడంలేదని, చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దొరకడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా కో-కన్వీనర్ తొర్లపాటి రాజు, కురెళ్ళ వరప్రసాద్, బంధం నాగేశ్వర రావు, తాళ్లూరి నాగరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి 108 ఉద్యోగుల సమ్మె బాట

- 15 డిమాండ్ల సాధన కోసం పట్టు
- నిలిచిపోనున్న అత్యవసర సేవలు

బుట్టాయగూడెం: అపర సంజీవని 108 అంబులెన్స్ సేవలు నేటి నుంచి నిలిచిపోనున్నాయి. ప్రజలకు అత్యవసరంగా తమ వంతు సాయం అందిస్తూ ప్రజల ప్రాణాలు కాపాడే 108 సిబ్బంది నేటి నుంచి సమ్మె బాట పట్టనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక 108 సిబ్బంది పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుంది. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇప్పటికే సిబ్బంది పలు నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ నెల 25లోగా ప్రభుత్వం స్పందించకపోతే సేవలు నిలిపివేస్తామంటూ స్పష్టం చేశారు. ఇప్పటికే ముందస్తు నోటీసులను ఉన్నతాధికారులకు అందజేశారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నేటి నుంచి 108 అంబులెన్స్ సేవలను నిలిపివేస్తూ సిబ్బంది సమ్మెబాట పట్టనున్నారు.

రోగులకు అవస్థలే

24 గంటలు అత్యవసర సేవలు అందిస్తున్న 108 ఉద్యోగులు సమ్మెబాట పట్టడం వల్ల రోగులకు పాట్లు తప్పవని అనిపిస్తుంది. ఇప్పటికే పలు మండలాల్లో 108 వాహనాల మరమ్మతు పేరుతో సేవలు దూరమయ్యాయి. ఇప్పుడు సిబ్బంది సమ్మెబాట పట్టడం వల్ల డయాలసిస్ రోగులు, గర్భిణులు, రోడ్డు ప్రమాదాల బారిన పడే క్షతగాత్రులను తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

108 ఉద్యోగుల డిమాండ్‌లు ఇవే

- 108 సర్వీసులోని ఉద్యోగులను వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులుగా గుర్తించి నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలి.
- జీఓ నెంబర్ 49ను పునరుద్ధరించాలి. ఫైలట్ గ్రాట్యుటీ, ఎర్నడ్ లీవు అమౌంట్ (అర్హత సెలవు మొత్తం) వార్షిక ఇంక్రిమెంట్‌ను చెల్లించాలి.
- ప్రతీ నెలా జీతాల చెల్లింపు 5లోగా జరగాలి. 108 వాహనంలో షిఫ్టుల పద్ధతే అమలు చేయాలి.



తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలుపుతున్న 108 సిబ్బంది

- వైద్య ఆరోగ్యశాఖలో చేపట్టే నియామకాల్లో సర్వీసుకు అనుగుణంగా వెయిటేజ్ మార్కులు అందించాలి.
- విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి మరణించిన తర్వాత బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా రూ.20 లక్షలు ఇవ్వాలి.
- 108 సర్వీసులో ఈఎంటీలుగా పనిచేస్తున్న వారి సర్వీసును పరిగణనలోకి తీసుకుని వైద్య ఆరోగ్యశాఖలో డీఎంఈ ద్వారా మెడికల్ కాలేజీలలో చేపడుతున్న ఈఎంటీ పోస్టులను నియమించాలి.
- రెండు షిఫ్టులలో షిఫ్టుకు 12 గంటల చొప్పున తీవ్ర ఒత్తిడిలో పనిచేస్తున్న తమకు మూడు షిఫ్టులలో రోజుకు 8 గంటల పనిదినాన్ని అమలు పరచాలి.
- వాహనాలను సరైన కండీషన్‌లో ఉంచాలి. వాహనం మరమ్మతు బిల్లులు ఉద్యోగులకు వెంటనే చెల్లించాలి.
- 108 వాహనానికి, దానిలో పనిచేస్తున్న సిబ్బందికి కనీస అవసరాలతో కూడిన భవనాన్ని నిర్మించాలి.

మా సమస్యలు పరిష్కరించాలి



108 అంబులెన్స్‌లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతున్నాం. ఎన్నో సంవత్సరాల నుంచి 108 వాహనంలో పనిచేస్తున్నాం. మా సమస్యలు విని వాటి పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేసి న్యాయం చేయాలి.

– డి.రాం ప్రసాద్, 108 సిబ్బంది, బుట్టాయగూడెం

షిఫ్టుల పద్ధతి అమలు చేయాలి



ప్రస్తుతం ఉన్న 12 గంటల డ్యూటీ విధానాన్ని రద్దు చేసి 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలి. దీనివల్ల పని ఒత్తిడి తగ్గుతుంది. మూడు షిఫ్టులలో రోజుకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలి. తమ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలి.

– కె.ఆనందరావు, 108 సిబ్బంది, జంగారెడ్డిగూడెం

గుండెపోటుతో అయ్యప్ప భక్తుడి మృతి



అయ్యప్ప దీక్షాదారుడు సురేష్‌ను ఆలయ ప్రథమ చికిత్స కేంద్రానికి తీసుకెళుతున్న దీక్షాధారులు

ద్వారకాతిరుమల: అయ్యప్ప దీక్షాధారుడు గుండెపోటుకు గురవ్వగా.. ఆస్పత్రికి తరలించే సమయంలో మధ్యలోనే మృతి చెందాడు. ఈ ఘటన క్షేత్రంలో ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో జరిగింది. అమలాపురానికి చెందిన కొందరు అయ్యప్ప దీక్షాధారులు ద్వారకాతిరుమల శ్రీవారి దర్శనార్థం రాత్రి ఆలయానికి విచ్చేశారు. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలోకి వెళ్లేసరికి, అప్పటికే సమయం ముగియడంతో సిబ్బంది ఆలయ రాజగోపుర ద్వారాలను మూసివేస్తున్నారు. అది చూసిన అయ్యప్ప దీక్షదారుడు కె.సురేష్(27) స్వామివారి దర్శనం కోసం పరుగులు తీస్తూ, గుండెపోటుకు గురై కుప్పకూలి పడిపోయాడు. అతని వెంట ఉన్న స్వాములు ఆలయ ఆవరణలోని ప్రథమ చికిత్సా కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు సీపీఆర్‌ను నిర్వహించారు. దేవస్థానం అంబులెన్స్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించే సమయంలో మార్గ మధ్యంలో మృతి చెందాడు.

ఆస్తి కోసమే జంట హత్యలు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్: తండ్రి ఆస్తి తనకే చెందాలనీ... పిన్ని, అతని కుమారుడికి ఆస్తిని దక్కనివ్వనంటూ హెచ్చరించిన అన్న.. ఆఖరికి ఆస్తి కోసం వారిని కడతేర్చాడు. ఈ జంట హత్యల కేసును పోలీసులు కేవలం 48 గంటల్లోనే ఛేదించి నిందితుడ్ని అరెస్ట్ చేశారు. ఆదివారం డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. మండవల్లి మండలం గన్నవరం గ్రామానికి చెందిన రొయ్యూరు సుబ్బారావుకు నాంచారమ్మతో మొదటి వివాహం జరిగింది. కొన్నాళ్ల తర్వాత నాంచారమ్మ చెల్లెలు భ్రమరాంబతో రెండో వివాహం జరిగింది. నాంచారమ్మ కొడుకు నగేష్ బాబు కాగా.. భ్రమరాంబకు కొడుకు సురేష్. తల్లితండ్రుల మృతి అనంతరం ఆస్తి మొత్తం తనకే కావాలని నగేష్ పట్టుబట్టాడు. ఆస్తి మొత్తం తనకు చెందకుంటే పిన్ని భ్రమరాంబ, తమ్ముడు సురేష్‌ను మట్టుబెడతానని అనేకసార్లు బెదిరించాడు. 41 సెంట్ల భూమిని అందరూ సమానంగా పంచుకోవాలని తల్లిదండ్రులు బతికుండగానే చెప్పారు. సురేష్‌కు గాయత్రితో వివాహం కాగా.. ఆమె తండ్రి మరణించడంతో ఈ నెల 21న గాయత్రి పిల్లలను తీసుకొని నూజివీడు మండలం ముద్రలు గ్రామానికి వెళ్ళింది. గన్నవరంలో తల్లి కొడుకు మాత్రమే ఉన్నారనే సమాచారంతో నగేష్ ఈ నెల 23న సురేష్, భ్రమరాంబపై కత్తితో దాడి చేశాడు. హత్యకు వినియోగించిన కత్తిని తీసుకువెళ్ళేందుకు నిందితుడు గ్రామానికి రావటంతో పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకుని విచారించారు. నగేష్‌బాబును అరెస్ట్ చేశారు.

హమాలీల కూలి రేట్లపై దిగొచ్చిన ప్రభుత్వం

ఏలూరు రూరల్ : కూలి రేట్లపై హమాలీలు చేసిన ఆందోళన సత్ఫలితం ఇచ్చిందని ఏలూరు జిల్లా పౌర సరఫరా సంస్థ హమాలీల సంఘం అధ్యక్షుడు శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కూలి రేట్లు పెంచాలని కోరుతూ ఈ నెల 19వ తేదీన హమాలీలు చేసిన నిరసనపై కూటమి ప్రభుత్వం దిగొచ్చిందన్నారు. రాష్ట్ర పౌరసరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హమాలీల సంఘం రాష్ట్ర నాయకులతో చర్చలు జరిపారని వివరించారు. ఇందులో క్వింటాకు రూ.3 కూలి రేటు పెంచేందుకు అంగీకరించారని, దీని వల్ల ఇప్పటివరకూ క్వింటాకు రూ.25 ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు రూ.28 అందిస్తుందన్నారు. ఈ నిర్ణయంతో పెరిగిన నిత్యావసర ధరలతో అవస్థలు పడుతున్న వందలాది మంది హమాలీలకు మేలు జరుగుతుందన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన రాహిత్యం

- అవగాహన కల్పిస్తున్నా మారని కొందరి తీరు
- వీధుల్లో, డ్రెయినేజీల్లో చెత్త పారబోత

తాడేపల్లిగూడెం: ఉదయం ఏడు గంటలకే పారిశుద్ధ్య కార్మికులు వేసే ఈల వినిపించగానే ఇంటిలో నుంచి చెత్త బుట్టలతో జనాలు చెత్తను తీసుకొచ్చి వారి చేతికి ఇస్తారు. వాహనం ఉంటే దానిలో లేదంటే పుష్ కాట్‌లో చెత్తనువేసి డబ్బాలను ఇంటి ముందు పెట్టి పారిశుద్ధ్య కార్మికులు వెళ్లిపోతారు. ఆదివారం, పండుగ రోజుల్లో తప్ప అన్ని రోజుల్లో వారు సేవలందిస్తారు. పట్టణం నలువైపులా విస్తరించి ఉండటం. ఒక పక్క పెరుగుతున్న జనాభా తాకిడి, మరో పక్క సంతమార్కెట్, వాణిజ్య సముదాయాలు చెత్తపోగవుతూనే ఉంటుంది. పట్టణంలో పారిశుద్ధ్యం లోపించకుండా అధికారులు వారి పరిధిలో చర్యలను తీసుకుంటూనే ఉన్నారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా చెత్త సేకరణ వాహనాలు నాలుగు నెలలుగా నిలిచిపోయాయి. వాటి స్థానంలో పుష్‌కాట్లు వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో కొంత మంది ఇంట్లో పోగయిన చెత్త, ఆహార వ్యర్థ పదార్థాలను ఒక క్యారీబాగ్‌లో పెట్టి రోడ్డు మీదకు లేదా డ్రెయినేజీల్లోకి విసిరేస్తేస్తున్నారు. ఒక పక్క చెత్త సేకరణ జరుగుతున్నా గుట్టలుగా రోడ్డుపై కవర్లతో చెత్త పడేస్తున్నారు. అంతేకాకుండా చిరిగిన వస్త్రాలు, శానిటరీ అవసరాలకు వినియోగించే వాటిని, ప్లాస్టిక్ డబ్బాలను రోడ్డుపై వేస్తున్నారు. దీంతో కొందరు చేసిన పనికి ఆయా ప్రాంతాల్లో నివాసం ఉండేవారు ఇబ్బంది పడాల్సి వస్తోంది. పొడి, తడి చెత్తగా వేరుచేసి, చెత్త సేకరణకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు మాత్రమే ఇవ్వాలని మునిసిపల్ అధికారులు కోరుతున్నారు. ప్లాస్టిక్ కవర్లను వినియోగించవద్దని, డ్రెయినేజీల్లో, రోడ్లపై చెత్త పారవేయవద్దని దీంతో దోమలు, కీటకాలు వృద్ధిచెంది వ్యాధులు వ్యాపింపజేస్తాయని కమిషనర్ నుంచి శానిటరీ సెక్రటరీల వరకు అందరూ ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నా, కొందరు చేసిన పనికి మూల్యం చాలా మంది చెల్లించాల్సి వస్తోంది.


కోతిబొమ్మ ప్రాంతంలో రోడ్లపై విచ్చలవిడిగా పడేసిన చెత్త

వాహనాలకు మాత్రమే చెత్తను ఇవ్వాలి

ఇళ్లల్లోని చెత్తను పొడి, తడి చెత్తగా వేరుచేసి చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే ఇవ్వాలి. రోడ్లపై, డ్రెయిన్లలో వేయవద్దు. ప్లాస్టిక్ రహిత మునిసిపాలిటీగా తీర్చిదిద్దడంలో ప్రజలంతా సహకరించాలి. ఇదే విషయమై శానిటరీ సెక్రటరీలు వార్డుల్లో అవగాహన కల్పిస్తున్నారు.

– ఏసుబాబు, మునిసిపల్ కమిషనర్, తాడేపల్లిగూడెం


పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు


ప్లాస్టిక్ వ్యర్థాలతో కలిగే అనర్థాలు, పారిశుద్ధ్యంపై అవగాహన పత్రాలు విడుదల చేస్తున్న శానిటరీ సెక్రటరీలు

క్లుప్తంగా

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు


పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో నిర్వాహకులు

తణుకు టౌన్: రక్షణ సైన్య చర్చి తణుకు డివిజన్ స్థాయిలో తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని రక్షణ సైన్య చర్చిలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం చర్చి డివిజన్ హెడ్ మేజర్ సీహెచ్ సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మేజర్ సీహెచ్ నిర్మలా దేవి, మేజర్ కె.జయానందం, లతా జోషి, ప్రసన్న కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో బంగారు పతకాలు


కరాటేలో బంగారు పతకాలు సాధించిన గూడెం విద్యార్థులు

తాడేపల్లిగూడెం: ఆకివీడులో ఆదివారం నిర్వహించిన ఏపీ స్టేట్ ఓపెన్ కియో జపాన్ షోటాఖాన్, ఇండియా కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో పట్టణానికి చెందిన షిర్డిసాయి స్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని బాధ్యులు జే శ్రీనివాసరామ్‌రాయ్ తెలిపారు. కె.ప్రశాంత్ బిలాల్, కె.హేమంత్ బిలాల్ కటా విభాగంలో బంగారు పతకాలు సాధించారు. కుమిటి విభాగంలో కె.వసంత్ రజత పతకం పొందారు. వీరికి కరాటే కోచ్ కె.శ్రీనివాసు అభినందనలు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


తన నివాసంలో పార్టీ శ్రేణులతో సమావేశమైన వడ్డి రఘురామ్‌నాయుడు

తాడేపల్లిగూడెం రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేంత వరకు పార్టీ శ్రేణులంతా కష్టపడాలని ఆ పార్టీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురామ్ నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లిగూడెంలోని ఆయన నివాసంలో పుల్లాయగూడెం, పడాల గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రఘురామ్‌నాయుడు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు అధైర్యపడవద్దని అన్నారు. ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని భరోసానిచ్చారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఎంపీటీసీ మార్లపూడి సుబ్బారావు, నాయకులు మాకరాజు సతీష్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం


నగదును అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. జెడ్పీ పాఠశాల అభివృద్ధికి 1983–84 బ్యాచ్ విద్యార్థులు పాఠశాల అభివృద్ధి పనుల నిమిత్తం రూ.63,000 నగదును ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చేతుల మీదుగా ఆదివారం ఎస్‌వీ సత్యనారాయణకు అందజేశారు. పూర్వ విద్యార్థుల అందించిన సాయంతో ఇనుము కొనుగోలు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే పాఠశాల అభివృద్ధికి ఎందరో భాగస్వామ్యులు అయ్యారని, మరింత మంది ముందుకు రావాలన్నారు.

‘అమ్మానాన్న’ పుస్తక ఆవిష్కరణ

ఉండి: కుటుంబ వ్యవస్థను బలోపేతం చేసేలా ‘అమ్మానాన్న’ పుస్తకం ఉందని రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ చైర్మన్ మంతెన రామరాజు అన్నారు. డీవీ బాలసుబ్రహ్మణ్యం రచించిన అమ్మానాన్న పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఉండి లయన్స్ ఆడిటోరియంలో రచయితలు, సాహితీవేత్తల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ సమాజంలో కుటుంబ బాంధవ్యాలు క్షీణించిపోతున్న సమయంలో రచయిత డీవీ బాలసుబ్రహ్మణ్యం ఓ మంచి పుస్తకాన్ని రచించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, పేరి కామేశ్వరరావు, పార్వతీశర్మ, కేఎస్ రావు, విజ్ఞాన వేదిక చెరుకువాడ రంగసాయి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సత్తి బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్తీక దీపోత్సవం

ఆకివీడు: మండలంలోని అజ్జమూరు గ్రామంలో పద్మావతి కల్యాణ మందిరంలో కార్తీక దీపోత్సవం ఈ నెల 25వ తేదీ సోమవారం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

కోడ్ ఉల్లంఘన


వల్లూరుపల్లి- దర్శిపర్రు గ్రామాల మధ్య వంతెన వద్ద జనసేన ప్రచార ఫ్లెక్సీ

పెంటపాడు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ప్రారంభమై 10 రోజులపైనే గడిచింది. కొన్ని గ్రామాల్లో అధికార పార్టీకి సంబంధించిన బ్యానర్లను రెవెన్యూ శాఖ సిబ్బంది పట్టించుకోలేదు. రాజకీయ నాయకులకు సంబంధించి బ్యానర్లు, ఫ్లెక్సీలపై ముసుగులు వేయాల్సి ఉంది. వల్లూరుపల్లి- దర్శిపర్రు గ్రామాల మధ్య వంతెన వద్ద ఓ రాజకీయ పార్టీ ఫ్లెక్సీపై ముసుగు వేయలేదు. వైఎస్సార్ సీపీ నాయకుల బ్యానర్లు, విగ్రహాలకు తక్షణం ముసుగువేసిన రెవెన్యూ అధికారులు, అధికార పక్ష కూటమి నాయకుల ఫ్లెక్సీలను తొలగించడంలో విఫలమయ్యారని స్థానిక నాయకులు విమర్శిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): టూ టౌన్ సౌత్‌లో 11కేవీ పడాల ఫీడర్‌కు సంబంధించి విద్యుత్ లైన్లకు అంతరాయంగా ఉన్న చెట్లు కొమ్మలను తొలగించేందుకు సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహ మూర్తి వెల్లడించారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పడాల, పడాల గరువు, యాగర్లపల్లి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సందడిగా కార్తీక వన సమారాధనలు


పెదతాడేపల్లి శ్రీగాయత్రి కల్యాణ మండపంలో కార్తీక వన సమారాధనలో మాట్లాడుతున్న వక్తలు


వెంకట్రామన్నగూడెం - తెలికిచర్ల రోడ్డులో ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజనీర్ల కార్తీక వన సమారాధన


శిల్పాశ్రమంలో బుర్ర కథ గానం

తాడేపల్లిగూడెం రూరల్: వెంకట్రామన్నగూడెం – తెలికిచర్ల, పెదతాడేపల్లిలో ఆదివారం కార్తీక వన సమారాధనలు సందడిగా సాగాయి. వెంకట్రామన్నగూడెం – తెలికిచర్ల రోడ్డులోని మామిడి తోటలో పశ్చిమగోదావరి, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజనీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మూడు జిల్లాలకు చెందిన ఎస్ఈలు, ఈఈలు, డీఈలు, ఏఈలు హాజరయ్యారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజా శ్రీనివాస్, ఎంఆర్‌సీలు రవి పాల్గొన్నారు. పెదతాడేపల్లి శ్రీగాయత్రి బ్రాహ్మణ కల్యాణ మండపంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. తొలుత కార్తీక దామోదరుని పూజ, రుద్రాభిషేకాలను కలిగొట్ల శ్రీనివాస్ – లలిత దంపతులతో నిర్వహించారు. బ్రాహ్మణ సేవా పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు పుల్లాబొట్ల వెంకటసూర్యనారాయణమూర్తి, బుద్ధవరపు సత్య వెంకటసుబ్బారావు, కోశాధికారి ప్రవా శ్రీనివాస్, కార్యనిర్వహణ కార్యదర్శి గరికపాటి బాపయ్య శర్మ పాల్గొన్నారు.

కోలాహలంగా కార్తీక వన సమారాధన

తాడేపల్లిగూడెం (టీఓసీ): భిన్న రంగాల వ్యక్తులను ఒక చోట చేర్చేందుకు వన సమారాధనలు దోహదం చేస్తాయని రంగస్థల కళాకారులు సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షురాలు దేవికారాణి వడయార్ పేర్కొన్నారు. ఆమె సౌజన్యంతో ఆదివారం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ దేవికారాణి శిల్పాశ్రమంలో వన సమారాధన కోలాహలంగా నిర్వహించారు. అధ్యక్షుడు సూరంపూడి వెంకటరమణ, సంఘ ఉపాధ్యక్షుడు జేకే కృష్ణ, నటుడు కూనిరెడ్డి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఏలూరు జగదీష్, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీకృష్ణ, కోశాధికారి మాసా బాబూరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కళాకారిణులను సత్కరించారు. మృత్యుంజయ రావు బృందంతో వీరాభిమాన్య బుర్ర కథ గానం, ముత్యాల రాంబాబు భగవద్గీత గానం, సినీ సంగీత విభావరి అలరించింది.

దళితులు జాతి అభివృద్ధికి కృషి చేయాలి


వేడుకల్లో పాల్గొన్న దళిత ఐక్య వేదిక నాయకులు

తణుకు అర్బన్: దళితులు ఐక్యంగా ఉండి, జాతి అభివృద్ధికి కృషి చేయాలని దళిత ఐక్య వేదిక అధ్యక్షుడు పొట్ల సురేష్ అన్నారు. దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం 75వ ప్లాటినం జూబ్లీ వేడుకను తణుకు అంబేద్కర్ భవనంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత ఐక్య వేదిక నియోజకవర్గ అధ్యక్షుడు పొట్ల సురేష్ మట్లాడుతూ దళితులు ఐకమత్యంగా ఉండి ప్రతి గ్రామంలోనూ కమిటీలుగా ఏర్పడి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దళిత వర్గాలకు కల్పించిన హక్కులను పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో దళిత నాయకులు కొండే నాగేశ్వరరావు, గొల్లపల్లి అంబేద్కర్, నక్కా రమేష్, నందమూరి శ్రీను, కేసరవెల్లి వెంకట్రావు, ఎం.ఏసు, సురేష్, పి.బాలు, తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు 6 ట్రక్కుల ఎండుగడ్డి తరలింపు


కె. పెంటపాడు గోశాలకు ట్రాక్టర్ల ద్వారా వచ్చిన గడ్డి మోపులను భద్రపరుస్తున్న సిబ్బంది

పెంటపాడు: కె.పెంటపాడు గోశాల అభివృద్ధికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఆవరణలో ఉన్న గోశాలలో సుమారు 80 గోవులు ఉన్నాయి. వీటికి దాణాగా వేసేందుకు ఎండుగడ్డిని ఏటా సేకరించి నిల్వ చేస్తారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో బీవీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సార్వా గడ్డిని భద్రపరిచే ప్రక్రియలో భాగంగా మొదటి విడతగా ఆదివారం 6 ట్రాక్టర్ల ద్వారా గడ్డిని ఆలయ ఆవరణకు తరలించారు. ఎండు గడ్డిని భద్రపరిచి ఆవులకు ఆహారంగా అందించనున్నట్లు ఈవో తెలిపారు. ఏటా ఇక్కడ గోశాలలోని గోవులకు 18 ట్రాక్టర్ల ఎండు గడ్డి అవసరమవుతుందన్నారు. దాతలు సహకరించి గడ్డిని ఆలయ గోశాలకు అందించాలన్నారు.

యువతకు రాజమార్గం ఎన్‌సీసీ


ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: ఆర్మీ, పోలీస్ వంటి సాయుధ దళాల్లో చేరే యువతకు ఎన్‌సీసీ రాజమార్గమని డీఎన్నార్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) అన్నారు. డీఎన్నార్ కళాశాలలో ఆదివారం 76వ ఎన్‌సీసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీఎన్నార్ ఎన్‌సీసీ విభాగం యువతకు మార్గ దర్శకత్వం వహిస్తూ ఎంతో మంది జీవితాలకు బంగారు బాటలు వేసిందన్నారు. ఎన్‌సీసీలో చేరిన ప్రతి క్యాడెట్ ఒక భాధ్యతాయుత అధికారిగా ఎదగాలని ఆకాంక్షించారు. ముందుగా ఎన్‌సీసీ క్యాడెట్ల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్యాడెట్లకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.మోజెస్, కె.రామకృష్ణంరాజు, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ ఎ.వీరయ్య, సీహెచ్ బోసురాజు, తదితరులు పాల్గొన్నారు.

నాగశ్రావణి కుటుంబ సభ్యులకు పరామర్శ

తాడేపల్లిగూడెం రూరల్: హత్యకు గురైన నాగశ్రావణి పిల్లలకు, వారి తల్లిదండ్రులకు గ్రామస్తులు అండగా నిలవడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మార్నీడి బాబ్జి అన్నారు. ఆదివారం మండలంలోని జగన్నాథపురంలో నాగశ్రావణి పిల్లల్ని, వారి తల్లిదండ్రులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మార్నీడి బాబ్జి మాట్లాడుతూ నాగశ్రావణి పిల్లలకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

తణుకు టౌన్: నియోజకవర్గంలో సొంత సొమ్ముతో వైద్యం చేయించుకున్న వారికి సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆయన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు.

బ్యాంకింగ్ రంగంలో పట్టాభి సేవలు చిరస్మరణీయం


రిటైర్డ్ ఆంధ్రా బ్యాంక్ మేనేజర్లను సత్కరిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: ఆంధ్రా బ్యాంక్ వ్యవస్థాపకులు భోగరాజు పట్టాభి సీతారామయ్య బ్యాంకింగ్ రంగం ద్వారా సమాజానికి ఎనలేని సేవలందించారని ప్రముఖ ఆడిటర్ జేఎస్ సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం తణుకులోని భోగరాజు పట్టాభి సీతారామయ్య జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పట్టాభి సీతారామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టాభి సీతారామయ్య బ్యాంకింగ్ రంగానికి చేసిన సేవలను గుర్తు చేశారు. స్వాతంత్ర్యోద్యమంలో జాతీయ కాంగ్రెస్ నాయకుడిగా ఆయన చేసిన సేవలను వివరించారు. అనంతరం ఆంధ్రా బ్యాంక్ విశ్రాంతి మేనేజర్లు వెలగలేటి బ్రహ్మానాయుడును సత్కరించారు.

ఆత్మీయుల సమ్మేళన వేదిక వనసమారాధన


కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ఆత్మీయుల కలయికకు కార్తీక వన సమారాధనలు ఎంతగానో ఉపయోగపడతాయని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. కార్తీకమాసం సందర్భంగా వివిధ సంఘాలతో పాటు స్నేహం, బంధుత్వం ఒకే వేదిక పైకి వచ్చి సంతోషంగా గడపడం కోసం ఏర్పాటు చేసుకునే వనసమారాధన నిర్వహణ అభినందనీయమని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో ఆదివారం నిర్వహించిన పలు వనభోజనాల కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్తీకమాసంలో ఉసిరిచెట్టుకు సాంప్రదాయ పూజలు నిర్వహించడం ఆచారమన్నారు. ప్రజలకు శివుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తణుకు పట్టణంలో నిర్వహించిన రెడ్డి జన సంఘం, కళింగ సేవా సంఘం, వెలమ సంక్షేమ సంఘం కార్తీక వనసమారాధనలతో పాటు దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాల్లో హాజరై వారందించిన సత్కారాలు పొందారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వన సమారాధన

పెంటపాడు: మండలంలో పలు గ్రామల్లో ఆదివారం కార్తీక వన సమారాధనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెంటపాడు శివారు ముత్యాలమ్మ వారి ఆలయం, బోడపాడు ఆర్చ్ వద్ద నియోజకవర్గ రెడ్డి సంఘ ఆత్మీయ వనసమారాధన ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడిగా కొనసాగింది. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన రెడ్డి సంఘ సభ్యులు కుటుంబాలతో ఉల్లాసంగా గడిపారు, క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. రెడ్డి సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ద్వారంపూడి వేణుగోపాలరెడ్డి, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, నాగేంద్రప్రసాద్‌రెడ్డి, పెంటపాడు ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, మేడపాటి చల్లారెడ్డి, సత్తి నర్సిరెడ్డి, గుడిమెట్ల శ్రీనివాసరెడ్డి, ముప్పిడి వెంకటరామిరెడ్డి నాయకత్వం వహించారు. పెంటపాడు, తాళ్లముదునూరుపాడు, వీరంపాలెం, బంగారుగూడెం ప్రాంతాలకు చెందిన రెడ్డి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కార్తీక వనసమారాధన

తణుకు టౌన్: కార్తీకమాసం సందర్భంగా ఆదివారం తణుకు మండలంలోని పలు గ్రామాల్లో కార్తీక వన సమారాధన కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. తేతలి గ్రామంలో కాపు సంఘం నేతలు నిర్వహించిన కార్తీక వనసమారాధనలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఎంపీపీ రుద్ర ధనరాజు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు, సరెళ్ల వీరతాత, ఇందుగపల్లి బలరామకృష్ణ, గామ సర్పంచ్ సరెళ్ల క్రాంతి ప్రియ, వివిధ రాజకీయ పార్టీలు, సంఘాల నాయకులు, కాపు సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఉమర్ ఆలీషా ఆశ్రమంలో

అత్తిలి: శ్రీవిశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం అత్తిలిశాఖ ఆశ్రమంలో ఆదివారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. పీఠం సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన వనసమారాధనకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.


రెడ్డి సంఘ ఆత్మీయ వన సమారాధనలో విద్యార్థులను, దాతలను సన్మానిస్తున్న రెడ్డి సంఘ సభ్యులు


సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులు

ఐదుగురు వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నిర్వహించే ఇంటింటికీ వైద్యసేవల కార్యక్రమంలో ఐదుగురు వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుత రామయ్య ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా తణుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంచం నుంచి లేవలేని వృద్ధుల వద్దకు వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు చేసి వైద్య సూచనలు, సలహాలు అందించారు. సంఘ సభ్యులు అక్కిన కాశీ విశ్వనాథం ఆర్థిక సహాయంతో మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎండీ స్వాహాలిక, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సర్దార్ వల్లభాయ్ పటేల్ శక్తి కేంద్రం అధ్యక్షుడు నరిశే సోమేశ్వరరావు అన్నారు. మన్‌కి బాత్ 116 కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక శక్తి కేంద్రంలో సోమేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నరిశే మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ సూచనలు మేరకు 2024లో ఎన్‌సీసీలో 20 లక్షల మంది యువత చేరారని చెప్పారు. శక్తి కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.